# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ సంపుటి : 2 సంచిక : 168 ఆదివారం 21 - 07 - 2024 పేజీలు : 08 వెల : 5



## విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న
తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో
పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.


9493669669, 9391230209




### మేడిగడ్డకు
## వరద పోటు

జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ ముచ్చట్లు : కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి భారీగా వరదనీరు పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత, గోదావరి నదికి వరద పెరిగింది. మేడిగడ్డ బ్యారేజ్ ఇన్ ఫ్లో ౘ ఔట్ ఫ్లో 3,84,400 క్యూసెక్ లు 85 గేట్లు ఓపెన్ చేసి పూర్తి స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. గత ఏడాది కుంగిన 20, 21 వ పీయర్స్ వద్ద కూడా సాఫీగా ఔట్ ఫ్లో సాగుతున్నట్టు చెప్తున్ఆరు. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజి నిండుకుండలా కనిపిస్తుంది. గోదావరి ,ప్రాణహిత వరదలతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది.

### కమ్మ అంటేనే...
## అమ్మలాంటి ఆప్యాయత



### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారు.. అమ్మలాంటి ఆప్యాయత కలిగినవారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కమ్మవారు నేలను నమ్ముకుని కష్టపడి పనిచేస్తారని అన్నారు. ఎక్కడ సారవంతమైన నేల ఉంటే అక్కడ కమ్మవారు కనిపిస్తారని చెప్పారు. కష్టపడటం పదిమందికి సాయం చేయడం కమ్మవారి లక్షణమన్నారు. కమ్మ గ్లోబల్ సమ్మిట్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కమ్మ సామాజికవర్గం తనను ఎంతగానో అభిమానిస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ లైబ్రరీలో చదువుకున్న చదువు, తమను ఉన్నత స్థానంలో నిలబెట్టిందని గుర్తుచేశారు. నాయకత్వానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని వివరించారు. ఎన్టీఆర్ రాజకీయం గా

2 లో

### పూరీ తీరానికి 40 కిలో మీటర్ల దూరంలో
## కేంద్రీకృతమైన వాయుగుండం
### తెలంగాణలో అతి భారీ వర్షాలు



హైదరాబాద్ జూలై 20: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం తీరం వైపుకు కదులుతోంది. పూరీ తీరానికి 40 కిలో మీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు

2 లో



## ఏ భయమూ వద్దు
### అత్యవసరంలో ఫోన్ చేయండి

మణుగూరుటౌన్ (భద్రాద్రి కొత్తగూడెం), తెలంగాణ ముచ్చట్లు :మణుగూరుతో పాటు సబ్ డివిజన్ ప్రజలు

2 లో

## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి
### సీఎం రేవంత్‌పై ఈటల ప్రశ్నల వర్షం



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను అమలు చేయడం లేదని, కేసీఆర్ హయాంలో కంటే.. రేవంత్ ప్రభుత్వంలోనే పోలీసులు రెచ్చిపోతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు మాత్రమే ఓటర్లు కాదు.. ప్రజలే మళ్లీ ఓట్లు వేయాలని రేవంత్ గుర్తుంచుకోవాలని అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై శనివారం బీజేవైఎం మహాధర్నా చేపట్టింది. ఈ మహాధర్నాలో ఈటల రాజేందర్ పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఐదేళ్ల తర్వాత ప్రజల దగ్గరకు రావాలని

2 లో

### పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై
## గవర్నర్‌కు బిఆర్ఎస్ వినతిపత్రం



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. కెటిఆర్ ఆధ్వరంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను కలిశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు, కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉద్యమ సమయంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయని, గ్రంథాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని, అక్రమంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎలను కాంగ్రెస్ పార్టీలో చేర్చు కుంటున్నారని కెటిఆర్ ధ్వజమెత్తారు. ఎంఎల్ఎలను చేర్చుకోవడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని, ఫిరాయింపుపై న్యాయ ప్రక్రియ

2 లో

### దేశ ఆర్థిక అభివృద్ధిలో
## గనుల పాత్ర ముఖ్యమైనది
### కేంద్ర మంత్రికిషన్ రెడ్డి



మణుగూరుటౌన్ (భద్రాద్రి కొత్తగూడెం), తెలంగాణ ముచ్చట్లు : బేగంపేటలోని వివంతా హోటల్ లో జరిగిన మినరల్ ఎక్స్ప్లోరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్‌షో లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ గనుల కు సంబంధించి ఇది చాలా ముఖ్యమైన సమయం సందర్భం. ప్రభుత్వ-ప్రైవేటు రంగ భాగస్వామ్యంలో గనుల తవ్వకం లో నూతన ఆవిష్కరణల తో పాటు మైనింగ్ సంబంధిత వర్గాల సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం నూతన ఆవిష్కరణలతో వైవిధ్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వారి చొరవ తో భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు. స్వయం సమృద్ధిని పెంచడమే మా ప్రభుత్వం లక్ష్యం. పారదర్శకతతో మైనింగ్

2 లో

### భారీ వర్షాలపై
### వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో
## జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
### సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : ఉత్తర తెలంగాణలోని 11 జిల్లాలలో ఈనెల ఆదివారం సోమవారం, తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయాజిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు.

## సికింద్రాబాద్‌లో రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు
### ఈ రూట్లో వెళ్తే ఇరుక్కోవడం పక్కా



హైదరాబాద్,తెలంగాణముచ్చట్లు : ఉజ్జయిని మహాకాళి అమ్మవారి బోనాల జాతర నేపథ్యం లో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈనెల 21, 22 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. కర్బలా మెయిన్ రోడ్డు, రాణిగంజ్, రామ్‌గోపాల్‌పేట ఓల్డ్ పీఎస్, పారడైజ్, సీటీవో ప్లాజా, ఎస్‌బీఐ ఎక్స్‌రోడ్, వైఎంసీఏ ఎక్స్‌రోడ్డు, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ ఎక్స్‌రోడ్, పాట్నీ ఎక్స్‌రోడ్, పార్క్‌లేన్, బాటా, ఘాస్‌మండి ఎక్స్‌రోడ్స్, బైబిల్ హౌజ్, మినిస్టర్‌రోడ్, రసూల్‌పురా తదితర రోడ్లు, జంక్షన్‌ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. అలాగే పాట్నీ ఎక్స్‌రోడ్డు, బాటా, ఘాస్‌మండి, అద్వైత, బైబిల్ హౌజ్, కర్బలా, రొచ్చా బజార్, ప్యారడైజ్ ఎక్స్‌రోడ్డుల వద్ద దారిమళ్లింపులు ఉంటాయని, పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా వాహనదారులు గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

# సంపాదకీయం

## బడ్జెట్ సమావేశాలు ఆదర్శంగా సాగాలి !

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయన్న ఆసక్తి నెలకొంది. అయితే గతంలో కన్నా ఇప్పుడు ఏకపక్ష నిర్ణయాలకు ఆస్కారం ఉండకపోవచ్చు. ఇకపోతే ఎన్‌డిఎ భాగస్వాములుగా ఉన్న టిడిపి, బీహార్ జనతాదళ్ వంటి పార్టీలు ప్రజల సంక్షేమం దృష్ట్యా తమ ప్రభావం చూపగలగాలి. మోడీ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకోగలగాలి. ఈ క్రమంలో ఈ సారయినా ప్రజా సమస్యలపై చర్చిస్తారా అన్నది చూడాలి. విపక్షాలు కూడా ఏ మేరకు ప్రతిభావంతంగా సమస్యలపై చర్చకు అవకాశం వచ్చేలా చేస్తాయో చూడాలి. ఇందిరాగాంధీ,పివి నరసింహా రావు, వాజ్‌పేయి హయాంలో సమస్యలపై చర్చించే వారు. గత పదేళ్లుగా ఆ ఆనవాయితీని మోడీ దెబ్బ తీసారు. సమగ్ర చర్చ అన్నదానికి అవకాశం లేకుండా పోయింది. బయట పెద్దపెద్ద మాటలు మాట్లాడు తున్న ప్రధాని మోడీ కూడా మణిపూర్ తదితర అంశాలపై చర్చించాలి. మణిపూర్ దారుణాలతో పాటు,అధిక ధరలు, జిఎస్టీ, రూపాయి పతనంపై చర్చించాలి. నిజానికి ప్రభుత్వాలు చేయాల్సిన పనులు సక్రమంగా చేస్తే సమస్యలు రావు. అలాంటి పనులు చేయడం లేదు. ప్రజల గురించి ఆలోచించడం నేర్చు కోవాలి. ధరల పట్టికలను ముందరేసుకుని, దానిపై పడుతున్న జిఎస్టీ భారాలను చంద్రబాబు, నితీశ్ తదిత రులు చర్చించాలి. సమస్యలను చూస్తే విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారాలి. ఏం చేస్తే దేశం బాగుపడుతుందో ఆలోచించే నేతలు లేకుండా పోయారు.పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. రాజకీయంగా తమకు అనుకూలంగా ఉండే నిర్ణయాలు తీసుకోవడంలో చూపించే శ్రద్ధ ప్రజల బాగు గురించి ఆలోచన చేయడం లేదు. గత పార్లమెంట్ సమావేశాల తీరు ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. కనీసం ఇప్పుడైనా సమస్యలపై చర్చించాలి. మరింత పట్టుదలగా పనిచేస్తానంటున్న మోడీ ఇప్పుడు సహచర మిత్రులు సలహాలతో ముందుకు సాగాలి. ఏకపక్ష నిర్ణయాలు పక్కన పెట్టాలి. గతంలో కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా సమస్యలపై సమగ్ర చర్చ జరిగేది. సమస్య తీవ్రత దేశానికి తెలిసి వచ్చేది. కానీ గత దశాబ్ద కాలంలో అలాంటి అవకాశం రాకుండా ప్రభుత్వం నిరంకుశంగా ముందుకు సాగింది. బడ్జెట్ కేటాయింపులు మొదలు, చర్చల్లోనూ నిరంకుశంగానే వ్యవహరించారు. ఈ క్రమంలో నిర్మలా సీతారామన్ రాష్ట్రాల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్నారా లేదా అన్నది బడ్జట్ పద్దుల్లో తేలనుంది. విపక్షాలు వివిధ అంశాలపై ఆందోళనకు దిగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉభయ సభలు వాయిదా పడుతూ వస్తున్న ఆనవాయితీని ఈ సారైనా పక్కన పెడతారా అన్నది చూడాలి. ప్రభుత్వం అన్ని సమస్యలను చర్చిస్తామని అంటున్నందున చర్చలకు అవకాశం ఇవ్వాలి. ప్రధానంగా ధరల పెరుగుదల,జిఎస్టీ వడ్డింపులు,ద్రవ్యోల్బణం పై చర్చకు అవకాశం ఇవ్వాలి. అయితే పార్లమెంట్ రూల్స్ మేరకు ఏ సమస్య అయినా ఓ ఆర్డర్‌లో చర్చించాల్సి ఉంటుంది. ఏదో ఒక రూల్ కింద మాత్రమే సమస్యను ప్రస్తావించాలి. అయితే విపక్షాలు ఆ పనిచేయకుండా గందరగోళంతో బయటకు రావాలని, ఆ పూటకు తమ డ్యూటీ అయిపోయిం దన్న రీతిలో ప్రవర్తించరాదు. విపక్షాలు కూడా రాజకీయ విన్యాసాలు పక్కన పెట్టి సమస్యలపై చర్చకు సహకరించాలి. ప్రభుత్వం కూడా అత్యవసర సమస్యలను గుర్తించి చర్చకు సహకరించడం అలవాటు చేసుకోవాలి. లేకపోతే ప్రభుత్వమే చర్చకు ముందుకు రావాలి. నిర్ణయం ఏదైనా చర్చించి ఎందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామో ప్రజలకు చెప్పాలి. ప్రధానంగా జిఎస్టీతో కలుగుతున్న దుష్పరిణా మాలను సమగ్రంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలు చర్చకు సన్నద్ధంగా ఉండాలి. ఆదాయం కోసం ఇబ్బడిముబ్బడిగా వసూళ్లకు తెగించిన మోడీ సర్కార్ సామాన్యుల గురించి, పేదల గురించి, దేశం గురించి ఆలోచించడం లేదు. నిజంగా సమస్యలను చర్చించి అమలు చేయాలన్న సదాశయం కూడా మోడీలో కానరావడం లేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో కేంద్రం ఘోరంగా విఫలం అయ్యిందనడం లో ఎలాంటి సందేహం అక్కర్లేదు. దీని కారణంగా దేశ ప్రజల జీవితాలు అస్తవ్యస్తం అవుతోంది. మోడీ ప్రభుత్వ అసమర్థత నిర్ణయాల కారణంగా దేశంలో నిత్యవసర వస్తువుల ధరలకు రెక్కలు వచ్చాయి. బ్లాక్ మార్కెట్ పెరగింది. బ్యాంకులు దివాళా తీస్తున్నాయి. ఆర్థికరంగం దివాళతో సామాన్యులు సతమతమవు తున్నారు. బ్యాంకుల తీరు కారణంగా సామాన్యులకు సక్రమమైన సేవలు అందడం లేదు. ఎగవేతదారులకు పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు డబ్బుల పందేరంతో ఖజానాలను దివాళా తీయిస్తున్నారు. దేశంలో ఆహారాధాన్యాల ధరలు పెరుగుతుంటే.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలోనూ మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి నిరంకుశంగా వ్యవహరించడం ఏరకమైన పాలన అంటరో తెలియ చేయాలి. ఉత్తరాది రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. యమునా నది ఉప్పొంగి ఢిల్లీ నగరం వరదలో మునిగి పోయింది. ఇలాంటి సమస్యలను గుర్తించి చర్చించ డం ద్వారా ప్రత్యామ్నాయం ఆలోచన చేయాలి.

### రుణమాఫీపై ఆందోళన వద్దు

## అర్హులైన ప్రతి ఒక్కరికీ అందచేస్తాం: తుమ్మల

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : రుణమాఫీపై రైతులకు ఎలాంటి అపోహలు వద్దని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుఅన్నారు.రైతులందరికీరుణమాఫీజరుగుతుందనిచెప్పారు. రాష్ట్రంలో ప్రతి రైతు అకౌంట్ నంబర్లు తమ దగ్గర ఉన్నాయని తెలిపారు.రుణమాఫీకాని వారికిఎందుకు కాలేదో.. ఎప్పుడు అయితుందో క్లారిటీ ఇస్తామన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ అందరికీ అవుతుందని తెలిపారు.ప్రతి రైతు కుటుం బాన్ని రుణవిముక్తి చేస్తామన్నారు. రుణమాఫీపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. చారిత్రాత్మకమైన కార్యక్రమంపై బురద జల్లొద్దని చెప్పారు. రుణమాఫీపై రైతులకు ఎవరికి అనుమానాలు ఉన్నా క్లార్గిఇస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జూలై 18న రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిన సంగతి తెలిసిందే. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన 11 లక్షల 50 వేల మంది రైతులకు 6098 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది. లక్షన్నర వరకు జూలై 30 వరకు లక్షన్నర నుంచి రెండు లక్షల రుణాలు ఉన్న రైతులకు ఆగస్టు 15 లోపు రుణమాఫీ పూర్తి చేస్తామని సీఎం రేవంత్ చెప్పిన సంగతి తెలిసిందే.

## 46దేశ ఆర్థిక అభివృద్ధిలో గనుల పాత్ర ముఖ్యమైనది

ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సంక్షేమం, క్లీన్ ఎనర్జీని పెంపొందించడం మా ఉద్దేశం. భారత దేశాన్ని ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ను రూపొందించడం, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం మా లక్ష్యం. ఈ సాధనలో మైనింగ్ సెక్టార్ ముఖ్యమైన పాత్ర పోషించనుంది మైనింగ్ సెక్టార్ భాగస్వామ్యం తప్పనిసరని అన్నారు. బలమైన మైనింగ్, మినరల్స్ సెక్టార్ లేకుండా స్వయం సమృద్ధి సాధ్యం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రెండూ మన ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు. మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. దాంతో పాటే మినరల్స్ కు డిమాండ్ పెరుగుతున్నది. అందుకే ఆధునిక టెక్నాలజీతో ఖనిజ సంపదను అన్వేషించాల్సిన సమయం ఇది. దీని కోసం ఊఎ ద్వారా ఎక్స్ టెన్సివ్ జియోలాజికల్ డేటా ను రూపొందించాం. ఎక్స్ ప్లోరేషన్ ను పెంచడానికి నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ ను కూడా ఏర్పాటు చేశాం. మినరల్ ఎక్స్ ప్లోరేషన్ కోసం ప్రైవేట్ కంపెనీలను కూడా నోటిఫై చేశాము. ఊఎ ద్వారా నేషనల్ జియో సైన్స్ డేటా డిపాజిటరీపై బేస్ లైన్ జియో సైన్ డేటాను అందుబాటులోకి తెచ్చాం. భవిష్యత్తులో సీస్మిక్ రిఫ్లెక్షన్స్, ఎలెక్ట్రో మాగ్నెటిక్ ఫీల్డ్ ప్రయోగం ద్వారా ఇంకా అడ్వాన్స్ డేటా అందుబాటులోకి తెస్తాం. మినరల్ ఎక్స్ ప్లోరేషన్ లో ఊఎ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ రోజు హ్యాకథాన్ పై ఇన్నోవేటివ్ మినరల్ హంట్ టెక్నిక్ ను ప్రారంభించుకోవడం కోసం మనం ఇక్కడ సమావేశమయ్యామని అన్నారు. 2015కు ముందు మైనింగ్ సెక్టార్లో అనేక సవాళ్లు ఉండేవి. బ్లాక్స్ కేటాయింపు పై అనేక కోర్టు కేసులు నడిచేవి. రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన భాగస్వామ్యం లభించేది కాదు. తగిన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల గ్రాంట్, రెన్యువల్స్ ఆగిపోయేవని అన్నారు. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో 2015లో ఓఆఖీ చట్టంలో పలు సవరణలు తెచ్చిన తర్వాతే మైనింగ్ సెక్టార్లో సంస్కరణలు మొదలయ్యాయి. ఆ సంస్కరణల లాభం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇప్పటి వరకు 373కి పైగా మైనింగ్ బ్లాక్స్ వేలం పూర్తయింది. అయితే ఈ ప్రయాణంలో 2023లో 24 క్రిటికల్ అండ్ స్ట్రాటజికల్ బ్లాక్స్ ను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ రోజు క్రిటికల్ మినరల్ కు సంబంధించి రెండవ, మూడవ ట్రాంచ్ కు చెందిన బిడ్డర్స్ ను ప్రకటించడం నాకు సంతోషంగా ఉంది.వారికి నా అభినందనలు. బిడ్డర్లు త్వరగా ఉత్పత్తి మొదలు పెట్టలని కోరుకుంటున్నాను. ఇదే ఉత్సాహంతో 4వ ట్రాంచ్ బిడ్ కోసం నేటి రోడ్ షో చాలా కీలకమని అన్నారు. భారత ఆర్థిక వృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి స్టేక్ హోల్డర్స్ కు ఇది ఒక గొప్ప అవకాశం. అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్ గఢ్, జార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్ ఈ 6 రాష్ట్రాల్లో వేలం వేయడానికి 10 కొత్త క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ ను గనుల శాఖ ఎంపిక చేసింది. మినరల్ ప్రభావిత వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 2015లో 23 రాష్ట్రాల్లోని 645 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ లు ఏర్పాటు చేసింది. మినరల్ రంగంలో ఇదో కీలక పరిణామం. మైనింగ్ ప్రభావిత వర్గాల సంక్షేమం విద్య, వైద్యం, స్కిల్ డెవలప్ మెంట్,వారి జీవనోపాధికి ఈ ఫండ్ కీలకంగా ఉంది. ఈ సందర్భంగా నేషనల్ డిఎంఎఫ్ పోర్టల్ ను ప్రారంభించడం నాకు సంతోషంగా ఉంది. ఖనిజ క్షేత్రంలో స్వయం సమృద్ధి సాధించడానికి మా ప్రభుత్వం కృత నిశ్చమతో ఉంది మనమంతా సంఘటితంగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుంది.ఈ మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని నేను కోరుకుంటున్నాను. మనందరం కలిసిగౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి లక్ష్యం ఆత్మ నిర్భర్ భారత్ కలను నిజం చేయడానికికృషి చేద్దామనిపిల్పునిస్తున్నానని అన్నారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రేవంత్‌కు వందేళ్ల కోసం ప్రజలు అధికారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. భేషజాలకు పోకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ఇచ్చిన హామీలనే నిరుద్యోగులు అడుగుతున్నారని గుర్తుచేశారు. అమలు చేసే దమ్మంటేనే ఎన్నికల్లో హామీలు ఇవ్వాలని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే అంతిమ నిర్ణేతలని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. గ్రూప్ – వన్‌లో 1:100 ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇంట్లో ఇబ్బంది లేకపోవచ్చు కానీ నిరుద్యోగులది ఇల్లు గడవని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళ్ల కిందకి నీళ్లు వస్తే.. రేవంత్ రెడ్డికి తెలుస్తుందని చెప్పారు. రేవంత్ చేసే మంచి, చెడు ఏంటో నిరుద్యోగులు లెక్క కడుతున్నారని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు.

## కమ్మ అంటేనే.. అమ్మలాంటి ఆప్యాయత

ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారని ఉద్ఘాటించారు. దేశంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాల వల్లే ఈరోజు చాలా మందికి రాజకీయ అవకాశాలు వచ్చాయని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు కమ్మవారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కమ్మవారిలో ఉన్న నైపుణ్యాలను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. తమకు భేషజాలు లేవని.. తాము కులాన్ని అభిమానిస్తామని.. ఇతర కులాలను గౌరవిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరిపై వివక్ష ఉండదని.. అది తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ఒక హక్కు అని చెప్పారు. నిరసన తెలపకుండా నియంత్రించాలనుకుంటే.. ఫలితాలు ఎలా ఉంటాయో చూశారని గుర్తుచేశారు.జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోందని గుర్తుచేశారు. కుల, మతాలకు అతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని ప్రోత్సహించాలని చెప్పారు. వివాదంలో ఉన్న 5ఎకరాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ సమస్యను పరిష్కరించడంతో పాటు సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పదిమందికి సాయం చేసే కమ్మవారు సహజ గుణాన్ని వీడొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు.



## పేదలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### -వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు: రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం రోజున హసన్ పర్తి టిటిడిసి సమావేశ మందిరంలో హనుమకొండ, కాజీపేట, హసన్ పర్తి 55,56,65,66డివిజన్ల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 80 మంది బాధితులకు మంజురైన 28 లక్షల రూపాయల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లబ్బిదారులకు అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే పేద ప్రజలను ఆదుకోవడం కోసం సిఎం రేవంత్ రెడ్డి గ లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సంక్షేమం కోసం. ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకటరామ్ నరసింహారెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘు చందర్, కార్పొరేటర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగేళ్లపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, అజయ్, శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు కొంక హరిబాబు, కనపర్తి కిరణ్, అయ్యాల రాంరెడ్డి, సీనియర్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, పోలేపాక అశోక్,చిర్ర విజయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## 73 పూరీ తీరానికి 40 కిలో మీటర్ల దూరంలో కేంద్రీకృతమైన వాయుగుండం

కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత నది వరద ప్రమాద స్థాయిని దాటి ప్రవాహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గోదావరి వద్ద నీటమట్టం 30.5 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులుకాగా ప్రస్తుతం 1066 అడుగుల వరకు నీరు చేరింది.

## ఏ భయమూ వద్దు

వచ్చే వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవరెడ్డి సూచిం చారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. వర దల కారణంగా అనుకోని సంఘ టనలు చోటు చేసుకుంటే వెంటనే 100కు డయల్ చేయాలని, లేదా స్థానిక పోలీస్‌స్టేషన్లకు సమాచా రమివ్వాలన్నారు. గోదావరి నది పెరుగుతున్న నేపథ్యంలో నది సమీప గ్రామాల ప్రజలు నదివైపు వెళ్లవద్దని, పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని సూచించారు.మణుగూరు మున్సిపాలిటీ, మండలంలోని పలు వరద ప్రాంతాలను, చెరువులను, వాగులను, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను శుక్రవారం తహసీల్దార్ రాఘవరెడ్డి సందర్శిం చారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

## 64 పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌కు బిఆర్ఎస్ వినతిపత్రం

నడుస్తుందని గవర్నర్‌కు తెలిపామన్నారు. వెంటనే గవర్నర్ స్పందించి, ఫిరాయింపులపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారన్నారు. మేడిగడ్డ కొట్టుకుపోయిందని, కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగపాలు అయ్యిందంటూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. అక్కడ జరిగిన చిన్న విషయంపై తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. కొన్ని రోజుల్లోనే రిపేర్లు పూర్తి చేశారని, ఇప్పుడు వరదలాగ నీళ్లు వస్తున్న మేడిగడ్డ తట్టుకోవటమంటే అదే కాళేశ్వరం గొప్పతనమని ప్రశంసించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తామని ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు వందల కోట్లు లాభం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని, ఇప్పుడు నాలుగు నెలలు వాయిదా వేశారని, ఇప్పుడు నాలుగు వందల కోట్లు లాభాలు వస్తున్నాయా? అని ప్రశ్నించడంతో పాటు అందులో సిఎం వాటా ఎంత? అని అడిగారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ధరణి సహాయ కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** జిల్లాలోని రైతులకు ఇబ్బంది లేకుండా ధరణి సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ధరణి సహాయ కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ధరణి సహాయ కేంద్రమును శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదు దరఖాస్తు నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించి, ధరణి సంబంధిత సమస్యల పైనే ఎక్కువ మంది బాధితులు వస్తుండడంతో వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. కలెక్టరేట్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ధరణిలో తమ సమస్యలకు సంబంధించి రైతులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సహాయ కేంద్రం లో సమాచారం అందిస్తామని తెలిపారు. రైతు సమస్య ను తెలుసుకొని, దానికి ఏఏ పద్దతిలో అప్లై చేయాలి, ఏయే ఆధారాలను అందించాలనే విషయాన్ని సిబ్బంది వివరిస్తారు. అలాగే అప్లికేషన్ రిజెక్ట్ కాకుండా రైతులు ప్రతి చిన్న పనికి పదే పదే అధికారుల చుట్టూ తిరగకుండా ఈ విధానాన్ని అమలుచేస్తున్నామని చెప్పారు. మీ సేవా కేంద్రాల ద్వారా రైతులు సరైన నమూనా లో దరఖాస్తు చేసుకోకపోవడం, దరఖాస్తుకు సంబంధించి సరైన ఆధారాలను చూపించక పోవడం వలన అధికారులు పరిశీలన సమయంలో వాటిని తిర్కరిస్తున్నారని దీంతో రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోందని, అందుకోసం దరఖాస్తు చేసే సమయంలోనే రైతులను సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ లు ఉపయోగ పడుతాయని వివరించారు. ధరణి సహాయ కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉ ఒడేలా కంప్యూటర్ ఆపరేటర్ ను నియమించామని, అప్లై చేసుకునే విధానంతో పాటు, దరఖాస్తు చేసుకున్న తర్వాత అప్లికేషన్ల స్థితిగతులను ను కూడా తెలుసుకోవచ్చుని అన్నారు ఒకవేళ అప్లికేషన్ రిజెక్ట్ అయితే, ఎందుకు రిజెక్ట్ అయిందనే కారణం కూడా సిబ్బంది చెప్పుతారని కలెక్టర్ తెలిపారు.



# బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ ను సన్మానించిన అడిషనల్ డీసీపీ, మినిస్ట్రీయల్ స్టాఫ్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా భాధ్యతలు నిర్వహిస్తున్న పి.రాము సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది బదిలీపై 6 వ బెటాలియన్ (భద్రాద్రి కొత్తగూడెం) కు వెళ్తున్న నేపథ్యంలో శనివారం నాడు పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మీన్ నరేష్ కుమార్ ముఖ్యతిథిగా పాల్గొని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా 20 సంవత్సరాలు పాటు పోలీస్ శాఖలోని మినిస్ట్రీయల్ స్టాఫ్ విభాగంలో సీనియర్ సూపర్నెంట్ పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఆనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక దృక్పథం, సేవా దృష్టి,మరియు తిరుమల తిరుపతి దేవస్థానానికి ధర్మాచారిగా గత ఐదు సంవత్సరాల నుంచి పనిచేస్తూ దైవ సేవలో ప్రతిష్టాత్మకమైనటువంటి డాక్టరేట్ పొందిన జే ఎస్ కె తులసీదాస్ ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో అక్తరునీసాబేగం, సెక్షన్ సూపరిండెంట్ జానకీరాం, యాసీన్ షరిఫ్, రాజలక్ష్మి , మినిస్ట్రీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

**కాజిపేట్ తెలంగాణ ముచ్చట్లు :** కాజీపేట మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆదేశానుసారం శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం ఇంచార్జ్ ప్రధానోపాద్యాయులు జె. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమములో భాగముగా ప్రేరణ. 2024 అను జాతీయ శిక్షణా కార్యక్రమమునకు ఎంపికైన పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని గండి వర్ష వారి తల్లిదండ్రులైన గండి రమేష్, గండి స్వర్ణలత ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్మ కమిటి కన్వీనర్ సభ్యులు సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు. ఈ పాఠశాల విద్యార్థు తల్లిదండ్రుల సమావేశంలో అమ్మా ఆదర్శ కమిటి కన్వీనర్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సునీత టీచర్ హాజరయ్యారు. ఈ సమావేశ కార్యక్రమానికి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ. వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**కాజిపేట్ తెలంగాణ ముచ్చట్లు** కాజిపేట్ జంక్షన్ సమీపంలోని రైల్వే కమ్యూనిటీ హాల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు కాజీపేట పోలీసులు తెలిపారు శనివారం ఉదయం కాజీపేట రైల్వే స్టేషన్ ఏరియాలో ఎస్ఐ నవీన్ కుమార్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తుల చేతిలో ప్లాస్టిక్ కవర్లు పట్టుకొని అనుమానస్పదంగా తిరుగుతూ పోలీసుల రాకను గమనించి భయపడి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా వారిని పట్టుకొని సంచిలో ఏముందని ప్రశ్నించగా వారు గంజాయి ఉన్నదని తెలిపినారని పోలీసులు తెలిపారు అందులో మొదటి వ్యక్తి కాజీపేట కు చెందిన సందీప్ రెండవ వరంగల్ కు చెందిన వ్యక్తి గోపాల శర్మ అని వారు తెలిపారు పోలీసులు ఇట్టి విషయాన్ని పై అధికారులకు తెలిపి పంచుల ను పిలిపించి వారి సమక్షంలో విచారించగా సందీప్ అనే వ్యక్తి వరుణ్ కుమార్ అతనితో పరిచయం ఏర్పడి అట్టి వ్యక్తి గంజాయిని వైజాగ్ నుండి తెచ్చి ఇక్కడ అమ్ముతుంటాడని వారు తెలిపారు నిందితులను పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి దరఖాస్తు ఇవ్వగా కాజీపేట ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి వారిని రిమాండ్కు పంపించడం జరిగిందని వారు తెలిపారు

# వందేళ్ల "గంధర్వ మహాల్".. ఓ అద్భుత కట్టడం

## గంధర్వ మహాల్ ను సందర్శించిన మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు



**భీమవరం, తెలంగాణ ముచ్చట్లు :** వందేళ్లు పూర్తి చేసుకున్న వైభవం ఇప్పటికీ తగ్గలేదని, ఇప్పటికీ కూడా చెక్కు చెదరకుండా ఉందని, ఆచంటలో నిర్మించిన ఈ కట్టడం ఇప్పటికీ చూపరులను ఆకట్టుకుంటోందని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణ, కొత్త శ్రీనివాస్, భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. ఆచంటలో వందేళ్ల పూర్తి చేసుకున్న 'గంధర్వ మహాల్ ను భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సందర్శించారు. వారు మాట్లాడుతూ బర్మా టేకు, విదేశాల నుంచి విద్యుత్ దీపాలు, బెల్జియం అద్దాలు ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన గంధర్వ మహాల్ వందేళ్లు పూర్తి చేసుకుందని, మైసూర్ ప్యాలెస్ మరించేలా 1924లో నిర్మించిన ఈ అద్భుత కట్టడం పశ్చిమ గోదావరి జిల్లాకే ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. అప్పటి ఆచంట జమీందార్ గొడవర్తి నాగేశ్వరరావు 1918లో ఈ మహల్ నిర్మాణాన్ని మొదలు పెట్టారని, ఆ కాలంలోనే రూ 10 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఈ ప్యాలెస్ 1924లో నిర్మాణాన్ని పూర్తిచేసుకుందన్నారు. ఎత్తైన భవనం నాలుగు వైపుల కోట మారిది బురుజులు, బర్మా టేకుతో చేసిన సింహద్వారాలు ఇప్పటికీ రాచఠీవిని గుర్తు చేస్తున్నాయని, ఈ భవనంలో మొత్తం నాలుగు అంతస్తులు, 12 బెడ్రూంలు ఉన్నాయని, ఈ గంధర్వ మహల్ కి 1969లో, చివరిసారిగా 2008లో రంగులు వేయగా, ప్రస్తుతం వందేళ్ల పండగ కోసం మరోసారి రంగులు వేయించారని, నాగేశ్వర్రావు మూడో తరం వారసులు వందేళ్లు పూర్తైన సందర్భంగా వేడుకలు నిర్వహించడం ఈ కార్యక్రమంలో మేమంతా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హసుమక్ లాల్ జైన్, పున్నాని కన్నయ్య,నడింపల్లి మహేష్, కోట్ల ప్రసాద్,గుండు సుమూర్తి,కోర్టు గుప్తా,మానేపల్లి వెంకన్న బాబు, పులవర్తి రామకృష్ణ, కురిశెట్టి శ్రీనివాస అప్పారావు, గుండు సుధీర్ మరియు సభ్యులు పాల్గున్నారు.

# పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. మహేశ్వరరావు

**పెంటపాడు, తెలంగాణ ముచ్చట్లు :** శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. మహేశ్వరరావు పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్య కేంద్రములో ఉండవలసిన మందులను,ల్యాబ్ నందు ఉండ వలసిన రక్త పరీక్షల కిట్లు మొదలగునవి అందుబాటులో ఉన్నాయో లేదని తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించి మరింత సమర్ధవంతం గా నిర్వహించేందుకు తగు సూచనలు సలహాలు యిచ్చారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది వారి సహకారముతో నిర్వహించాలని దోమలు, వాటి లార్వాలాను నిర్మూలించుటకు లార్విసైడ్ ఆయిల్ను స్ప్రే చేయుట, ప్రజలలో పరిసరాల పరిశుభ్రత గురించి ఆరోగ్య విద్యా బోధన చేయుట తదితర ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్ర స్థాయి సిబ్బందితో చేయాలని తెలిపారు.






# శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో దోహదపడుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 75.వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాల లో స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ తో కలసి పోలీస్ కమిషనర్ స్కూల్ మైదానంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతూ.. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, నగరాలు, గ్రామీణప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందిస్తే జీవ వైవిధ్యంలో సమతుల్యత సాధించవచ్చని అన్నారు. .కాలుష్యం కారణంగా దెబ్బ తింటున్న పర్యావరణానికి రక్షణకవచం ఏర్పడి వాతావరణంలో ఆక్సీజన్ స్థాయి పెంచే మొక్కలను నాటే బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వీకరించాని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ ఐ కామరాజు, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు , వన మహోత్సవ కార్యక్రమ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి చొరవతో కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ
- ఈ విద్యా సంవత్సరం నుండే అందుబాటులోకి
- సోమవారం నుంచి అడ్మిషన్ల ప్రారంభం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** బాధ్యతలు స్వీకరించి ఏడాది తిరగకముందే పాలేరు నియోజకవర్గాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపనల చేయడం, మున్నేరుకు కరకట్ట నిర్మాణ పనులను ప్రారంభించడం , చెక్ డ్యాంల ఏర్పాటు అదేవిధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రి పొంగులేటి చొరవ నేపథ్యంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కూసుమంచి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డ్ కు ఆదేశాలు ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 ఏడాది నుంచే కళాశాల అందుబాటులోకి రావాలని ఆ జీవోలో పేర్కొన్నారు. ఈ నెల 22 సోమవారం నుంచి విద్యార్థినీ,విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కూసుమంచిలో కళాశాల ఏర్పాటు పట్ల పాలేరు నియోజకవర్గానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఏఐ ఆర్ పి ఇ యు అధ్యక్షుడిగా బొద్దున వెంకటేశ్వర్లు

కాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు : ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా బొద్దున వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు కాజీపేట లోని మీడియా పాయింట్లు లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్చి 2 తారీకు నుండి 4 వ తారీకు వరకు హనుమకొండలో జరిగిన అఖిలభారత గ్రామీణ ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలు జరిగాయని ఆయన తెలిపారు ఈ సందర్భంగా జాతీయస్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని ఆ సంఘ ప్రెసిడెంట్ గా గరిమెళ్ళపల్లి గ్రామం హన్మకొండ డివిజన్ తెలంగాణ సర్కిల్ కు చెందిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ బొద్దున వెంకటేశ్వర్లు మాస్టర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గాఉత్తరప్రదేశ్ సర్కిల్ లోని ఉమాపూర్ గన్న పట్టి సుల్తాన్పూర్ డివిజన్ కు చెందిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సిబి తివారి ఉదయ్ గడ్ పలము డివిజన్ జార?ండ్ సర్కిల్ కు చెందిన అజయ్ కుమార్ సింగ్ వైస్ ప్రెసిడెంట్ గా మధ్యప్రదేశ్ సర్కిల్ కు చెందిన రామ్ సింగ్ బీహార్ సర్కిల్లోని రాజాపూర్ బి ఓ బెంగు సరి డివిజన్ కు చెందిన యుగల్ కిషోర్ రాయి జనరల్ సెక్రెటరీగా కర్ణాటక సర్కిల్ కు చెందిన దూర్వాని నగర్ పిఓ బెంగళూరు ఈస్ట్ డివిజన్ కు చెందిన ఎస్ఎస్ మహాదేవయ్య అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా తమిళనాడు సర్కిల్ ముంబాకం బిఓ సంగువరచత్రం కాంచీపురం డివిజన్ కు చెందిన జి డి ఎస్ పోస్ట్ మాస్టర్ సి కె సుబ్రమణి మహారాష్ట్ర సర్కిల్ సతారా డివిజన్ కు చెందిన ఆర్ జె చౌహాన్ జిడిఎస్ ఎండి హర్యానా సర్కిల్ గౌవుల గురుగావ్ డివిజన్ కు చెందిన విజయ్ శర్మ బిపిఎం ట్రెజరర్ గా చత్తీస్గడ్ సర్కిల్ గోల్ బజార్ పీవో బిలాస్పూర్ డివిజన్ కు చెందిన నారాయణ చౌదరి జిడిఎస్ ఎండి అసిస్టెంట్ ట్రెజరర్ గా ఉత్తరాఖండ్ సర్కిల్ లోని పితోర గడ్ డివిజన్ కు చెందిన చరణ్ సింగ్ బిష్ బిపియం ఆర్గనైజింగ్ సెక్రటరీగా పంజాబ్ సర్కిల్ లోనే టర్న్ తారన్ అమృత్సర్ డివిజన్ కు చెందిన జస్బీర్ సింగ్ బిపిఎం హిమాచల్ ప్రదేశ్ సర్కిల్ లోని బనూరి బిఓ పాలమూరు డివిజన్ కు చెందిన నవీన్ చంద్ కతోచ్ బిపిఎం గా ఎన్నికైనట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నుకున్న కార్యవర్గాన్ని కేంద్ర ప్రభుత్వం తపాల శాఖ అధికారికంగా ఢిల్లీలో ఈనెల 19న ప్రకటించి ఆర్డర్ విడుదల చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత ప్రజలకు దేశవ్యాప్తంగా అత్యున్నతమైన సేవలను అందిస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు మెడికల్ సౌకర్యము గ్రూప్ ఇన్సూరెన్స్ సీనియార్టీ ప్రకారంగా ఇంక్రిమెంట్లు సరైన గ్రాట్యూటీ మరియు లీవ్ ఎన్ క్యాష్ మెంట్ కల్పించకపోవడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు కనీస వేతనం సౌకర్యాలు కల్పించాలని ఏడవ వేతన కమిటీ సిఫార్స్ చేసిన గత ఏడు సంవత్సరాలు గా వాయిదా వేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి




కమలేష్ చంద్ర కమిటీ అనుకూల సిఫార్సులను అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు గ్రామీణ తపాల ఉద్యోగులకు రిటైర్ అయిన తర్వాత పెన్షన్ వైద్య సదుపాయాలు కల్పించాలని ఈ సమావేశముఖంగా కోరారు. ఉద్యోగులు సెలవులో ఉన్నప్పుడు పనిచేసిన సబ్స్యూట్లకు సాలరీ ఏరియాస్ తొందరగా చెల్లించాలని ఆయన కోరారు .త్వరలో న్యూఢిల్లీలో ఆల్ ఇండియా కార్యవర్గం సమావేశమై గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నూతన కేంద్ర ప్రభుత్వంతో సహృద్భావ వాతావరణంలో చర్చించి అమలు చేయుటకై కార్యచరణ అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. జాతీయస్థాయి నూతన కార్యవర్గాన్ని ఆమోదించినందుకు తపల శాఖకు కేంద్ర ప్రభుత్వానికి వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగుల పెన్షనర్ అసోసియేషన్ ఆల్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవ రెడ్డి గ్రామీణ తపాల ఉద్యోగుల రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమకొండ డివిజన్ అధ్యక్షులు పి తిరుపతి కోశాధికారి జె బాపూజీ సీనియర్ నాయకులు మర్రి కొమ్ము రారెడ్డి, పిట్టల అశోక్ యూనియన్ నాయకులు కురుసపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో హాస్పిటల్లో అరుదైన చికిత్స

## -మహిళకు కడుపులో తొమ్మిది కేజీలు గడ్డ తొలగింపు

## -డాక్టర్ పరికల రాము గౌడ్కు పలువురి అభినందన



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :ఖమ్మం నగరంలోని మెట్రో హాస్పిటల్ లో గత తొమ్మిది నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్న అఖిలా అనే పేషెంట్ కు హాస్పిటల్ వైద్యులు పరికల రాము గౌడ్ సకాలంలో స్పందించి శస్త్ర చికిత్స ద్వారా ఎంతో శ్రమించి 9 కేజీల గడ్డను తొలగించారు. ఈ సందర్భంగా హాస్పటల్ వైద్యులు రాము గౌడ్ మాట్లాడుతూ అఖిల అనే మహిళ పేషంట్ గత 9 నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నానని తమ హాస్పిటల్ ను సంప్రదించారని, దీంతో మేము టెస్టులు నిర్వహించి ఆమె కు కడుపులో గడ్డ ఉందని గుర్తించి,శస్త్ర చికిత్స ద్వారా దాన్ని తొలగించామని, సుమారు తొమ్మిది కేజీల గడ్డగా తేలిందని ఆయన పేర్కొన్నారు. తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న మహిళకు సుమారు తొమ్మిది కేజీల గడ్డను తమ నైపుణ్యంతో శస్త్ర చికిత్స ద్వారా తొలగించిన పరికల రాము గౌడ్ ను పలువురు అభినందించారు.



# ఊరట కలిగిస్తున్న రుణమాఫీ

## - అనర్హులకు ఆపేయడం మంచి పరిణామం

## - జిల్లా రైతాంగంలో ఆనందోత్సాహం

నిజామాబాద్,జూలై20: తాజాగా రైతురుణమాఫీ కొంద ఆదుకున్నదని జిల్లా రైతాంగం అభిప్రాయ పడుతోంది. గతంతో పోలిస్తే ఈ మాఫీ తమకు ఊరట కలిగించేదే అని అన్నారు. గతంలో మాఫీ పేరుతో ప్రకటనలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. అనర్మలకు రుణయాఫీ చేయకపోవడం, రైతు భరోసా ఇవ్వకపోవడం మంచి నిర్ణయమని అన్నారు. గతంలో కార్లలో తిరిగే వారు డబ్బులు పోగేసుకునేందుకు వచ్చే వారని అన్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులన్ని గతేడాది వరదనీటిలో కొట్టుకు పోయాయి. సకాలంలో బ్యాంకు రుణాలు అందకపోయినా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగుచేశామని జిల్లా రైతులు వాపోతున్నారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు మొక్కజొన్న, పసుపు పంటలు వేస్తున్న రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. నష్టపోయిన పంటలకు, ఆస్థులకు పరిహారం అందించాలన్న డిమాండ్ సర్వత్రా నెలకొంటోంది. ఇదిలావుంటే ప్రకృతి వైఫరీత్యాల కారణంగా జరిగిన నష్టాలకు కేందప్రభుత్వమే పరిహారం అందించాల్సి ఉంటుందని అధికార బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోగా, అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల పంటలను కోల్పోయే రైతులకు నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవడం లేదు. కంటితుడుపు చర్యలకే పంట నష్టం సర్వేలు జరుగుతున్నాయి. పంట నష్టం గురించి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినప్పుడు తమకు ఎంతో కొంత నష్టపరిహారం వస్తుందని ఆశ పడుతున్నారు. వరదల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షం, వడగండ్లు, కరువుతో పంట నష్ట పోయిన పరిహారం అందక రైతులు అ ప్పుల ఊబిలో కూరకపోతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం బీమా నిబంధనలు సడలించి గతంలో ఫస ల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం లో బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులతో పాటు పొందని రైతులకు అవకాశం కల్పించేవారు. పంట రుణాలు పొందిన రైతులకు బీమా తప్పని సరి. రుణాలు పొందిన వారు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరం చొప్పున ప్రీమియం చెల్లించడం ద్వారా పైరు నాటు వేసినప్పటి నుంచి కొత కోసే వరకు పంట నష్టానికి బీమా కంపెనీలు బాధ్యత వహిస్తుంటాయి.దేశానికి అన్నం పెట్టే రైతన్నకు భరోసా లేకుండా పోతోంది. పంటల సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలకు రైతన్న తీ వ్రంగా నష్టపోతుండగా, ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారు. ప్రకృతి వైపరిత్యాలకు దెబ్బతిన్న పంటలకు రైతులను ఆదుకునేందుకు ఫసల్ బీమా పథకం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేందుకు పలు పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్నప్పటికీ అన్న దాతలకు మాత్రం ఎలాంటి ప్రయోజనలు చేకూరడం లేదు. ఈ పథకాలకు ప్రభుత్వాలు మధ్యంతరంగా నిలిపివేయడంతో అమలుకావడం లేదు. పంట నష్టం సర్వేలతోనే అధికారులు సరిపెడుతున్నారు. ఇవి కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. నష్టం పరిహారం సకాలంలో అందించకపోవడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం గతంలో ఫసల్భీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రకృతి వైఫరీత్యాల సమయంలో దెబ్బతిన్న పంటలకు ఈ పథకం ద్వారా రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించేవారు. ఈపథకంలో లోపాలున్నాయనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ప్రత్యామాయ్నంగా మరో పథకం ఏవి తీసుకురాలేదు. ప్రకృతివైఫరీత్యాలతో మూడేళ్లుగా నష్టపోతున్న రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. రైతులు ఏ కారణంతో చనిపోయిన రైతుబీమా అమలుచేస్తున్న ప్రభుత్వం పంట నష్టపోతే ఆర్థిక భరోసా మాత్రం ఇవ్వడం లేదు.

# రాష్ట్రంలో దాడులు ఆపాలి

## - హత్యలపై పార్లమెంటులో లేవనెత్తుతాం

## - రాజ్యసభ వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

అమరావతి,జూలై20 : నెల రోజుల టీడీపీ పాలనలో జరిగిన హత్యలు, దాడులపై పార్లమెంట్లో గళమెత్తుతామని రాజ్యసభ వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. ఏపీలో వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినుకొండలో వైసీపీ నేత రషీద్ హత్యను ఎంపీ ప్రస్తావించారు. బాధితుణ్ని కత్తితో చేతులు నరికి, తీవ్రంగా గాయపరిచి చంపడం దారుణం అని ఎంపీ అన్నారు. వైసీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు చేయకుండా సీఎం చంద్రబాబే వారి పార్టీ కేడర్ను ఆపాలన్నారు. ఈనెల 22నుంచి జరిగే ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో పరిస్థితులపై వైసీపీ ఎమ్మెల్యేలు నిరసన తెలపనున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఏపీలో జరిగే దాడులను దేశ ప్రజలకు సైతం తెలియజేస్తామని అయోధ్య రామిరెడ్డి అన్నారు. అందు కోసం ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేస్తామని ఎంపీ వెల్లడించారు. ఏపీ పరిస్థితులు వివరించేందుకు ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అపాయింట్మెంట్ కోరినట్లు తెలిపారు. ఈనెల 24న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేసే ధర్నాకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తామని అయోధ్య రామిరెడ్డి చెప్పుకొచ్చారు. అయితే ఏపీలో శాంతిభద్రతలు అదుపుతప్పాయంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేస్తామంటూ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి పరామర్శించారని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులపై ఢీల్లీలో ధర్నా చేసి అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి రాష్ట్ర పరిస్థితులపై వివరిస్తామని చెప్పారు. రాష్ట్రపతి పాలనకు సైతం డిమాండ్ చేయనున్నట్లు ఎంపీ అయోధ్య రామిరెడ్డి వెల్లడించారు.

# మసిపూసి మారేడుకాయలా మాపై నిందలా.. జగన్పై బీజేపీ నేత ఫైర్

అమరావతి, తెలంగాణ ముచ్చట్లు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో ధర్నా చేస్తానంటూ జగన్ ఇచ్చిన స్టేట్మెంట్పై ఆయన మండిపడ్డారు. "జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేస్తాడంట" అంటూ ఎద్దేవా చేశారు. ఐదేళ్లల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ కోరాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన దాడులు, దారుణాలపై ధర్నాలో చెప్పాలన్నారు.

**ఆ ఘనత జగన్దే...**

ఐదేళ్లల్లో సీఎంగా జగన్ ప్రజలు, పత్రికలపై చేసిన దాడి లోకమంతా చూసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ను పూర్తిగా ఆందోళన ప్రదేశ్గా మార్చిన ఘనత జగన్కే దక్కిందని వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతి వాతావరణం కల్పించిందని తెలిపారు. కక్ష సాధింపులు కాదని... అభివృద్ధి ఆంధ్రప్రదేశ్వైపు అడుగులు వేస్తుందిని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో అరాచకాలు దేశంలోనే చర్చగా మారాయన్నారు. జగన్ ఇప్పుడు మసిపూసి మారేడుకాయ అన్న చందంగా తమ మీద నిందలు వేస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో శాంతి భద్రతలపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తామని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

**ఢిల్లీలో ధర్నా: జగన్**

కాగా.. ఏపీలో జరుగుతున్న అరాచకాలపై ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేయనున్నట్లు జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. నిన్న (శుక్రవారం) వినుకొండలో నడిరోడ్డుపై హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని జగన్ పరామర్శించి ఆపై మీడియాతో మాట్లాడారు. ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని అన్నారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలువనున్నట్లు తెలిపారు. ఏపీలో జరుగుతున్న దాడులపై ప్రధానికి వివరించనున్నట్లు తెలిపారు.

# పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఉంగుటూరు, తెలంగాణ ముచ్చట్లు : భారీ వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఉంగుటూరు మండలంలోని కైకరంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నాయకులు పర్యటన చేసి భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. రైతులను కౌలు రైతులను అడిగి నష్టం వివరాలను, ముంపునకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటలు ముంపుకు గురై అన్నదాతలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రు.12వేలకు పైగా పెట్టుబడి పెట్టారని చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# సివిల్స్ అందుకునే వారి కోసం చేయూత

**- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం'పథకం ప్రారంభం - సింగరేణి ఆర్థిక సాయంతో అభ్యర్థులకు భరోసా - ఇకనుంచి ఏటా జూన్‌లో జాబ్ క్యాలెండర్ - డిసెబర్ కల్లా అపాయింట్‌మెంట్లు - నిరుద్యోగులకు అండగా నిలవడమే మా లక్ష్యం - సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**





**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. సివిల్స్ అభ్యర్థులకు చేయూతనిచ్చేలా ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం'పథకాన్ని ప్రజాభవన్‌లో శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నారు. నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడ మే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అందుకే అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. గత పదేళ్లలో నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందని అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని మార్పులు చేశామని తెలిపారు. గ్రూప్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. అంతకుముందు సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ పాల్గొన్నారు. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడింది. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. నిరుద్యోగుల బాధలు మాకు తెలుసు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇచ్చాం. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాం.పరీక్షలు మాటిమాటికి వాయిదా పడటం మంచిదికాదు.అభ్యర్థుల సమస్యలను అర్థం చేసుకుని గ్రూప్-2ను వాయిదా వేశాం. నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం అని సిఎం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తున్నాం. జూన్ 2న నోటిఫికేషన్, డిసెంబర్ 9 లోపు ఉద్యోగాలిచ్చేలా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తరపున సాయం చేస్తున్నాం. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా జాబ్ సాధించాలి. సివిల్స్ సాధించి మన రాష్ట్రానికే రావాలి. ఐఏఎస్, ఐపీఎస్‌లు మన వారైతే రాష్ట్రానికి మంచి జరుగుతుంది.నోటిఫికేషన్ ఇచ్చి సమయానికి పరీక్షలు నిర్వహించిన దాఖలాలు గత పదేళ్లలో లేవు. అందుకు కారణమేదైనా యువత ఉజ్వల భవిష్యత్ ఆగమైంది. దురదృష్టవశాత్తూ కొన్నేళ్లుగా తెలంగాణలో యువత ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేదానికంటే.. పరీక్షల్లో జరిగే నిర్వహణ లోపాలపై కొట్లాడేందుకే వారి సమయం వృథా అయ్యింది. యూపీఎస్సీ ఎప్పుడు పరీక్షలు నిర్వహించినా.. వాటిపై ఆరోపణలు లేవు. అందుకే మేం గతంలో యూపీఎస్సీ ఛైర్మన్‌ను కలిశాం. యూపీఎస్సీ తరహాలో కొన్ని మార్పులు చేసి వెంట వెంటనే నోటిఫికేషన్లు ఇస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్-2 పరీక్ష వాయిదా వేశామని చెప్పారు. ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే అని తెలిపారు. పకడ్బందీ ప్రణాళికతో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ ఏటా మార్చ్‌లోగా అన్ని శాఖలలో ఖాళీల వివరాలు తెప్పించుకుంటామన్నారు. జూన్ 2 లోగా నోటిఫికేషన్ వేసి డిసెంబర్ 9లోగా నియామక పక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సింగరేణి సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ తరపున సాయం చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టనున్నాం. మరోవైపు, తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీ ఏర్పాటుపై ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ వర్శిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పరిశ్రమల విభాగం ఢిల్లీ, హర్యానాలో ఉన్న స్కిల్ యూనివర్శిటీలను పరిశీలించి.. స్కిల్ వర్శిటీ నమూనా ముసాయిదా తయారుచేసినట్లు పేర్కొన్నారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, ఈకామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్‌కామిక్స్‌తొలుత ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులు ప్రవేశపెడతారనిఅన్నారు.తొలి ఏడాది 2 వేల మందితో ప్రారంభించి క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారని వివరించారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం రీ డిజైన్

**- మేడిగడ్డ కెసిఆర్ హయాంలోనే కూలింది**

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు :** కేసీఆర్ అధికారంలో ఉండగానే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. దీనిపై అప్పట్లో కేసీఆర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ప్రపంచమంతా ఈ వింత చూసిందని అన్నారు. విమర్శలు వచ్చినా దానిని పక్కన పెట్టారని మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ మీటింగ్ కు హాజరైన ఉత్తమ్.. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై చర్చించామని చెప్పారు. సోమవారం ఇంజినీర్ల స్థాయిలో చర్చలు ఉంటాయన్నారు. ఎన్డీఎస్ ఏలో కాళేశ్వరంపై చర్చించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును నీళ్లు లేవనే కారణంతో మేడిగడ్డ దగ్గర కట్టారన్నారు ఉత్తమ్. తుమ్మడి హట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి ఉంటే ఇంకోలా ఉండేదని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్లను ప్రతిపాదించిందన్న ఉత్తమ్.. కమీషన్ల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు రీ డిజైన్ చేసి కాళేశ్వరం నిర్మించిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా కాళేశ్వరం నిర్మించింది..అందుకోసం హై క్లాస్ లోన్స్ తీసుకొచ్చారని తెలిపారు. కాళేశ్వరం కట్టింది కమీషన్ల కోసమేనని మొదటి నుంచి చెబుతున్నామన్నారు. కాళేశ్వరంతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. ఏటా 10 వేల కోట్ల వడ్డీలు కడుతున్నామని చెప్పారు. ఆ ప్రాజెక్టు కింద కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడా రాలేదన్నారు ఉత్తమ్.

# నేడు ఉజ్జయినీ మహంకాళి బోనాలు

**- అత్యతంత సుందరగా ఆలయ అలంకరణ**

**- సిసి కెమెరాల ఏర్పాటు..పటిష్ట బందోబస్తు**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :** ఆదివారం జరుగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గత రెండు మూడు రోజులుగా పలువురు మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు.తెలంగాణ దశాబ్ది బోనాల ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహిస్తుందని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నగరవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో చెక్కుల పంపిణీ పూర్తయిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా 10 శాతం అదనంగా కేటాయించినట్లు చెప్పారు. ఈనెల 28న లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాలిబండ అక్కన్న మాదన్న ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భాగ్యలక్ష్మి ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, మీరాలం మండి మహంకాళి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సబ్జిమండి నల్లపోచమ్మ ఆలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎన్టీఆర్ నగర్‌లోని ఖిలా మైసమ్మ ఆలయంలో మంత్రి సీతక్క, నాచారం ఉప్పల్ మహంకాళి సహిత మహా కాళేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ మహాకాళి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని నిర్వాహకులు ఆహ్వానించారు. మహాకాళి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ శుక్రవారం తెలిపారు. సుమారు 1500 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 400 సీసీ కెమెరాలతో పాటు మహాకాళి ఠాణాలో ప్రత్యేక జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఉజ్జయినీ మహాకాళి బోనాల ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు గ్రేటర్ ఆర్టీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆది, సోమవారాల్లో 24 డిపోల నుంచి సికింద్రాబాద్‌కు మొత్తం 175 బస్సులను నడుపుతున్నట్టు వెల్లడించింది. భక్తుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ - 99592 26147, జేబీఎస్ - 99592 26143, ఎంజీబీఎస్ - 99592 26130 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని వివరించారు.

# భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి

**భద్రాద్రి కొత్తగూడెం,తెలంగాణ ముచ్చట్లు :**భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతున్నది. భద్రాచలం వద్ద గోదావరి వరద ముంచెత్తుతున్నది. శనివారం మధ్యాహ్నం 4 గంటల వరకు 35 అడుగులకు నీటమట్టం చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు కొనసాగుతున్నందున ఇంకా గోదావరిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు 44 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరింకు జారీ చేసే అవకాశం ఉండనున్నది. గోదావరిలో 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద జారీ చేస్తారు. వరదల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు అధికారులను అప్రమత్తం చేశారు. మరో వైపు భద్రాచలంలోని తాలిపేరు జలాశయానికి భారీగా వరద కొనసాగుతున్నది. దాంతో అధికారులు ప్రాజెక్టు 26గేట్లు ఎత్తివేశారు. వచ్చిన వరదను దిగువకు వదులుతున్నారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదు

**- పోలీస్ రాజ్యంగా మారిన తెలంగాణ**

**- ఈటెల రాజేందర్ విమర్శలు**



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను అమలు చేయడం లేదని, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో కంటే.. రేవంత్ ప్రభుత్వంలోనే పోలీసులు రెచ్చిపోతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు మాత్రమే ఓటర్లు కాదు.. ప్రజలే మళ్లీ ఓట్లు వేయాలని రేవంత్ గుర్తుంచుకోవాలని అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై శనివారం బీజేవైఎం మహాధర్నా చేపట్టింది. ఈ మహాధర్నాలో ఈటల రాజేందర్ పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఐదేళ్ల తర్వాత ప్రజల దగ్గరకు రావాలని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రేవంత్‌కు వందేళ్ల కోసం ప్రజలు అధికారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. భేషజాలకు పోకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ఇచ్చిన హామీలనే నిరుద్యోగులు అడుగుతున్నారని గుర్తుచేశారు. అమలు చేసే దమ్ముంటేనే ఎన్నికల్లో హామీలు ఇవ్వాలని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే అంతిమ నిర్ణేతలని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. గ్రూప్ - వన్‌లో 1:100 ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇంట్లో ఇబ్బంది లేకపోవచ్చు కానీ నిరుద్యోగులది ఇల్లు గడవని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళ్ల కిందకి నీళ్లు వస్తే.. రేవంత్ రెడ్డికి తెలుస్తుందని చెప్పారు. రేవంత్ చేసే మంచి, చెడు ఏంటో నిరుద్యోగులు లెక్క కడుతున్నారని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు.

# ముంబైలో భారీ వర్షాలకు కూలిన పాత భవనం

**ఇద్దరు మృతి..మరో ముగ్గురికి గాయాలు**

ముంబయి,జూలై 20: గత కొద్ది రోజులుగా ముంబయిలో కురుస్తున్న భారీ వర్షాలతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా శనివారం ఓ భవనం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రాంట్ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉదయం 10.30గంటలకు భారీ వర్షాల కారణంగా శనివారం ఓ భవనంలోని ఒక భాగం కూలింది.

# కరెంట్ కోతల ఆందోళనలు చూసి ఎన్నాళ్లయ్యింది

## - ఫోటోను షేర్ చేస్తూ..కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ వ్యాప్తంగా కరెంట్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయని, ప్రతి రోజు, ప్రతి గంట.. రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో కరెంట్ కోతలు ఉంటున్నాయని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. కరెంట్ కోతలు నిరంతరం విధిస్తుండడంతో అటు అన్నదాతలు, ఇటు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రైతులు సబ్ స్టేషన్లను ముట్టడిస్తూ తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణలో కరెంట్ కోసం అన్నదాతల నిరసనలు చూసి యుగాలు అయిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇది మార్పు మహాత్యం అని ఆయన విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామంలో గత కొద్ది రోజుల నుంచి కరెంట్ కోతలు ఉన్నాయి. కరెంట్ కోతల కారణంగా వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నామని నిరసన వ్యక్తం చేస్తూ నిన్న సబ్‌స్టేషన్‌కు తాళం వేశారు రైతులు. కరెంట్ సరిగా లేకపోవడం కారణంగా గ్రామంలో కూడా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు మండిపడ్డారు. రైతుల ధర్నాకు సంబంధించిన దృశ్యాలను కేటీఆర్ తన ట్వీట్‌కు ట్యాగ్ చేశారు.

# 25న కేబినేట్ భేటీ

## బడ్జెట్‌కు ఆమోదముద్ర

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : ఈ నెల 25న తెలంగాణ కేబినెట్ భేటీ జరుగనుంది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉదయం 9 గంటలకు కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కేబినెట్ బ్జడెట్‌కు ఆమోదం తెలపనుంది. మరోవైపు.. ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న బ్జడెట్ సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచరంతో సమాధానాలు పంపాలని ఆమె అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సెషన్‌లో సమన్వయ లోపం గ్యాప్ లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సీఎస్ తెలిపారు. రాష్ట్ర వార్షిక బ్జడెట్‌ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనుంది. నోట్ ఆన్ డిమాండు మరియు రూపొందించి బ్జడెట్‌ను సిద్ధంగా ఉంచాలని, తద్వారా సభ్యులు దానిని పరిశీలించడానికి.. చర్చకు సంబంధించిన విషయాలను లేవనెత్తడానికి తగిన సమయం ఉంటుందని ఆయన అధికారులను కోరారు.

# అనకాపల్లి- రాజమండ్రి రహదారి విస్తరణ

## ఎన్నికల హామీల అమలుకు కృషి: సీఎం రమేశ్

అనకాపల్లి,తెలంగాణ ముచ్చట్లు : అనకాపల్లి నుంచి రాజమండ్రి వరకు జాతీయ రహదారి అరులైన్లు విస్తరించేలా త్వరలో చర్యలు తీసుకుంటామని ఎంపీ సీఎం రమేష్ వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చోడవరం - మాడుగుల నియోజక వర్గాల మధ్య 5000 ఎకరాలతో సెజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే నక్కపల్లిలో సెజ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో మంత్రులను కలుస్తామని చెప్పారు.

# నేటి ఢిల్లీకి సీఎం రేవంత్

- రేండ్రోజుల పాటు ఢిల్లీలోనే మకాం
- కాంగ్రెస్ అగ్రనేతలో చర్చలు
- మరోమారు పలువురు కేంద్రమంత్రులతో భేటీ

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆది, సోమవారాల్లో ఆయన హస్తినలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి రేంవత్ రెడ్డి ఢిల్లీ చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో పాటు.. పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణతో పాటు కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై హైకమాండ్‌తో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పదవుల పంపకం పూర్తవ్వడంతో.. మిగిలిన పదవులు ఎవరెవరికి కేటాయించాలి.. పదవులు దక్కని సీనియర్లను ఎలా గౌరవించాలనే విషయంపై కూడా అధిష్టానంతో రేవంత్ చర్చించనున్నారు. మరోవైపు వరంగల్‌లో ఏర్పాటుచేయబోయే భారీ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ అమలు చేయడంతో రాహుల్‌తో సభ పెట్టిస్తే బాగుంటుందనే ఉద్దేశంలో రాష్ట్ర నాయకులు ఉన్నారు. ఈ విషయాన్ని హైకమాండ్‌కు రేవంత్ తెలియజేయనున్నారు. రెండు రోజుల పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. విభజన హామీల అమలుతో పాటు.. కొత్త రుణాలు, ప్రాజెక్టుల మంజూరుపై వివిధ శాఖల మంత్రులతో సమావేశమవుతారు. రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసే అవకాశం ఉంది. మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించనున్నారు. పెండింగ్ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని కోరనున్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేతో పాటు రాహుల్ గాంధీని కలవనున్నారు. పార్టీకి సంబంధించిన అంశాలపై ఆయన చర్చించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తుండటంతో మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్‌తో చర్చించి.. ఎవరిని కొత్తగా మంత్రి వర్గంలోకి తీసుకోవాలనేదానిపై రేవంత్ చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించడంతో పాటు.. చేరికల అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పీసీసీ చీఫ్ ఎంపికపై ప్రస్తుత ఢిల్లీ పర్యటనలో క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. గత ఢిల్లీ పర్యటనలోనే పీసీసీ చీఫ్ ఎంపికపై ఓ నిర్ణయానికి వచ్చినప్పటికీ.. పార్టీలో ఏకాభిప్రాయం రాకపోవడంతో పీసీసీ చీఫ్ ఎంపిక వాయిదాపడింది. ఈసారి మాత్రం కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను హాజరు పర్చండి
- నాంపల్లి కోర్టు సంచలన ఆదేశాలు



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏ1 ప్రభాకర్ రావు (ఎస్ఐబీ మాజీ చీఫ్), ఏ6 శ్రవణ్ రావును కోర్టులో హాజరుపర్చాలని నాంపల్లి కోర్టుఆదేశాలు జారీసింది. ఇప్పటికే ప్రభాకర్ రావుపైన కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావు వర్చువల్‌గా విచారణకు హాజరవుతారని కోర్టు దృష్టికి దర్యాప్తు బృందం తీసుకెళ్లింది. అయితే ప్రభాకర్ రావు విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను పోలీసులు ఇండియాకు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికాలో ప్రభాకర్ రావు ఉన్నట్లు సిట్ బృందం గుర్తించింది. శ్రవణరావు ఆచూకీని మాత్రం దర్యాప్తు బృందం ఇప్పటికీ కనుకోలేకపోయినట్లు తెలుస్తోంది. కాగా... ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావే ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చిన విషయం తెలిసిందే. ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే ఫోన్ టాపింగ్ జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఫోన్ టాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభాకర్ రావు విదేశాలకు వెళ్లిపోయాడు. దీంతో ప్రభాకర్ రావు ఆచూకీ కోసం పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. లుక్ అవుట్ నోటీసులకు స్పందన లేకపోవడంతో.. రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఈ కేసులో ప్రణీత్ రావు ఏ2గా, తిరుపతన్న ఏ3గా, భుజంగరావు ఏ4గా, రాధాకిషన్ రావు ఏ5గా ఉన్నారు. ఈ నలుగురు ఇటీవల దాఖలు చేసిన మ్యాండేటరీ బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి క్రిమినల్ కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. లాగే ఈ కేసులో అరెస్ట్ అయి చంచల్‌గూడ జైలులో ఉన్న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావుపై మరో కేసు నమోదు అయ్యింది. నాంపల్లి కోర్టులో పీటీ వారెంట్‌పై పోలీసులు రిమాండ్ చేశారు. యజమానిని కిడ్నాప్ చేసి క్రియా హెల్త్ కేర్ సంస్థలో కోట్ల విలువైన షేర్లను నలుగురు డైరెక్టర్ల మీదకు బలవంతంగా బదిలీ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుమాధవ్ ఫిర్యాదుతో కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో రాధాకిషన్‌రావుతో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సహా చంద్రశేఖర్, కృష్ణ, గోపాల్, రాజ్, రవి, బాలాజీలపై కేసు నమోదు అయ్యింది. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు.



# పర్యాటక ప్రాంతాలను గుర్తించాలి

## డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సూచన

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :రాష్ట్రంలో అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు.. జలపాతాలు ఉన్నాయి. వాటిని గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, ఎన్సీసీపై బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. సాంస్కృతిక సారధి కళాకారులు గత ఏడు నెలలుగా ఏ విధులు నిర్వహిస్తున్నారని డిప్యూటీ సీఎం ఆరా తీశారు. కళాకారులను సమాజ అభివృద్ధికి పూర్తిగా వాడుకోవడం లేదు.. వారి సేవలు వినియోగించుకునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేసింది.. ఫలితంగా వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది.. గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయండి, మిగిలిన భవనాలు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో క్రీడా మైదానాలు ఉన్నాయి.. వాటిని నిరుపయోగంగా ఉంచడం మూలంగా ఆక్రమణలు జరుగుతున్నాయి.. అధికారులు వెంటనే స్పందించి.. నిత్యం క్రీడలు నిర్వహించి? మైదానాలను ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యార్థులకు క్రీడా మైదానాల్లో క్రీడలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల క్రీడా మైదానాలు ఆక్రమణలకు గురైనట్టుగా సమాచారం ఉంది.. వెంటనే ఆ విషయాలపై దృష్టి సారించి ఆక్రమణ దారులను ఖాళీ చేయించండి.. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఏడాది మొత్తంగా ప్రభుత్వ క్రీడా మైదానాల్లో యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీజ్‌లో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, అడవులను పర్యాటక సాంస్కృతిక శాఖలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కల్చర్ అంటే ఆటలు, పాటలు అనుకుంటున్నారు.. కానీ కల్చర్ అంటే జీవన విధానం అని చాలా మందికి తెలియదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు.. తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాల పైన గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చెక్ పోస్టులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు.

# కవి జయరాజ్‌కు గుండెపోటు - హుటాహుటిన నిమ్స్‌కు తరలింపు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్ గుండెపోటుకు గురయ్యారు. శనివారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. కాగా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన కృషికిగాను తెలంగాణ ప్రభుత్వం 2023లో కాళోజీ నారాయణ రావు అవార్డును అందించిన విషయం తెలిసిందే. మహబూబాబాద్ జిల్లాకు చెందిన జయరాజ్ చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలను అనుభవించి కవిగా పేరు తెచ్చుకున్నారు. మహబూబాబాద్ మండలం గుమ్మనూర్ లో గోడిశాల చెన్నమ్మ, గొడిశాల కిష్టయ్య దంపతులకు జన్మించారు జయరాజ్. పేద దళిత కుటుంబానికి చెందిన జయరాజ్ వివక్షత లేని సమ సమాజం కోసం తన సాహిత్యాన్ని సృజించారు. పేద దళితకుటుంబానికి చెందిన జయరాజ్ వివక్షలేని సమాజం కోసం కృషి చేశారు. బుద్ధుడి బోధనల ప్రభావం ఆయనపై చాలానే ఉంది. అంబేద్కర్ రచనలతో స్ఫూర్తి పొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పల్లెల్లో తిరుగుతూ తన ఆటపాటల ద్వారా ప్రజల్లో ఉద్యమ భావజాలాన్ని రగిలించారు. ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం పలు పాటలు రాశారు. మనిషికీ, ప్రకృతికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పల్లె పల్లెనా తిరుగుతూ.. తన ఆట పాట గానం ద్వారా ప్రజల్లో తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ భావజాలాన్ని రగిలించిన ప్రజా కవిగా జయరాజు కృషి చేశారు.

ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం పలు పాటలు రచించారు. మనిషికీ ప్రకృతికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారు. ఈ మేరకు వారు ముద్రించిన పలు పుస్తకాలు ప్రజాదరణ పొందాయి. తెలంగాణ బతుకు ఛిద్రమైన జాడను తన పాటల్లో పట్టి చూపించిండు. ప్రజల గుండెల్లో చిరకాలం యాదికుండే పాటలు రాసిన జానపద గాయకుడు విప్లవోద్యమంలో అనేక పాటలకు ప్రాణం పోసిండు. పోరాడకుంటే బతుకు మారదని, తన పాటలు, రచనల ద్వారా ప్రజలకు దోపిడి మర్మాన్ని విప్పి చెప్పిండు. జయరాజు పాటలు ప్రజలను ఉద్యమ బాటలో నడిపిస్తయి. జోలాలీ పాటవింటే వందకోట్ల భారతీయుల కన్నీటి కథ మన కండ్లముందు ఉంటది. తన స్నేహితుడు చేరాల కనుమూసినపుడు ' నిన్నెట్టా మరిచిపోదును చేరాల..' అన్న పాట ఆయన కలం నుంచి పట్టిన తొలి పల్లవి. కాచినపల్లి ఎన్‌కౌంటర్ పై రాసిన పాట ప్రతి హృదయాన్ని కదిలించింది. ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, పాలకుల పీడనవంటి దీర్ఘకాలిక సమస్యలను పాటగట్టి జనాన్ని పోరుబాట పట్టిచ్చిండు. అడవిలో అన్న సినిమాకు హైలెట్‌గా నిలిచిన 'వందనాలమ్మ పాట' జయరాజ్ కలం నుంచి వచ్చిందే. దండోరా సినిమాలోని కొండల్లో కోయిల పాటలు పాడాలి అనే పాటను జయరాజ్ రాశారు.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
తెలుగు దిన పత్రిక





## ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న.. ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం, తెలంగాణ ముచ్చట్లు : తుపాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భీమవరం లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురు అయ్యాయి. ముంపునకు గురు అయిన ప్రాంతాలను శనివారం ఎమ్మెల్యే అంజిబాబు పరిశీలించారు.





## భీమవరానికి పొంచి ఉన్న వరద ముంపు !

- మెంటే వారి తోటను చుట్టుముట్టిన వరద...
- ఏటిగట్లు బలహీనపడడంతో తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలని కోరుకుంటున్న స్థానిక ప్రజలు

భీమవరం, తెలంగాణ ముచ్చట్లు : గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు ఒకవైపు, ఎగువ నుండి వస్తున్న వరద నీటితో మరొకవైపు భీమవరం లోగల యనమదుర్రు డ్రెయిన్ ఉధృతస్థాయిలో ప్రవహిస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలు వల్ల పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుండి వరద నీరు యనమదుర్లోనికి వచ్చి చేరుతోంది. దీనితో యనమదుర్రు ఒకరు రూపం దాల్చి ఏటుగట్లు సరి సమానంగా వరద నీరు ప్రవహిస్తోంది. స్థానిక బైపాస్ రోడ్డు వంతెన( బీవీ రాజు విగ్రహం) వద్ద గల యనమదుర్రు కాలువకు ఇరువైపులా ఏటిగట్లు బలహీనపడడంతో తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలని దుర్గాపురం, మెంటేవారి తోట ప్రజలు స్థానిక అధికారులను కోరుకుంటున్నారు .

# ముంపు సమస్య పరిష్కారానికి కృషి

### - మెంటే పార్థసారథి





భీమవరం, తెలంగాణ ముచ్చట్లు : భీమవరం పట్టణం దుర్గాపురం మెంటేవారితోటలోని ముంపుకు గురైన ప్రాంతాలలో భీమవరం టిడిపి జనసేన నాయకులు పర్యటించారు.స్థానికుల సమస్యలను తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరదలతో నదులు కాలువలు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నాయని యనమదుర్రు డ్రైన్ కీ ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతా నివాసాలలో వరదనీరు చేరడంవల్ల వారికి పునరావస కేంద్రంలు ఏర్పాటు చేయడం జరిగిందని ముంపు లేకుండా శాశ్వత పరిష్కారానికి భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు ఎన్డీఏ ప్రభుత్వం దృష్టికి ముంపు ప్రాంతాల సమస్యలను వివరించి ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు గూడూరి సుబ్బారావు టిడిపి జనసేన నాయకులు ఎద్దు ఏసుపాదం మెంటే గోపి పామర్తి వెంకటరామయ్య గంటా త్రిమూర్తులు మద్దుల రాము మాదాసు కనకదుర్గ సయ్యద్ నసీమా బేగం ఎండి షబీనా గంధం రాధ బొక్క శ్రీను నేదునూరి గంగాధర్ మద్దుల మావుల్లయ్య దొంగ వెంకటేశ్వరరావు కోరిపల్లి శ్రీనివాసరావు చోడిశెట్టి నారాయణస్వామి బాతు నరేష్ మెంటే మనోజ్ తోట సురేష్ నక్క బేన్నీ మేడిశెట్టి లోవరాజు రాంబాబు పులపర్తి మోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# క్రైస్తవ పుణ్యక్షేత్రాల జోలికి వెళ్లొద్దు..

### హెచ్చరించిన ఆస్క నాయకులు అగస్టీన్ శేఖర్ !




దేవరపల్లి, తెలంగాణ ముచ్చట్లు : దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం మేరీ మాత పుణ్య క్షేత్రం జోలికి రావద్దని అంబేద్కర్ ఆశయ సాధన పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు కొమ్మిన అగస్టీన్, కండెల్లి శేఖర్ హెచ్చరించారు. గౌరీపట్నం పుణ్యక్షేత్రాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నించడంతో దాన్ని ఖండించేందుకు శనివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన కొమ్మిన ఆగస్టీన్, కండెల్లి శేఖర్లు సంయుక్తంగా మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాదిమంది భక్తులతో విరజిల్లుతున్న మేరీ మాత పుణ్యక్షేత్రానికి చెడ్డపేరు తెచ్చేందుకు కొంతమంది కుట్రకు పాల్పడటం దారుణమని వారు అభిప్రాయపడ్డారు. ఒకరి స్వార్థం కొరకు అన్నదమ్ముల వంటి మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతూ.. పుణ్యక్షేత్రం పరువు పోయేలా కరపత్రికలు విడుదల చేయడం మరీ దారుణం అన్నారు. ఇటువంటి హేయమైన చర్యలకు పాల్పడితే తగిన శిక్ష అనుభవించక తప్పదని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని వారు వివరించారు. ఫాదర్ జాన్ పీటర్ బాధ్యతాయుతమైన తండ్రి అని, అలాంటి మంచి ఫాదర్ పై బురద చల్లడం తగదని హితవు పలికారు. ఎవరైతే పుణ్యక్షేత్రం పరువు తీయాలని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారో వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో పూర్తి ఆధారాలతో ఫాదర్ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పుణ్యక్షేత్ర పరువు తీయాలని చూస్తే వారు ఎంతటి వారైనా సహించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆగస్టీన్ శేఖర్లు హెచ్చరించారు. కులాలకు అతీతంగా మతాలకు అతీతంగా భక్తి భావనతో పనిచేస్తున్న ఫాదర్ జాన్ పీటర్ పై స్వార్థపూరితంగా దుష్ప్రచారం చేయాలని చూస్తే రాష్ట్రంలో క్రైస్తవ నాయకులంతా ఏకమై తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఎవరైతే మేరీ మాత పుణ్యక్షేత్రంపై అసత్య ప్రచారం చేస్తున్నారో... అటువంటివారు చట్టపరంగా కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు. కొంతమంది గ్రూపుగా తయారయ్యి ఫాదర్ని బ్లాక్ మెయిల్ చేయడం తగదని వివరించారు. ఎవరైనా బ్లాక్ మెయిల్ కు పాల్పడితే పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని అందుకు బ్లాక్ మెయిలర్స్ సిద్ధంగా ఉండాలని తెలిపారు. పుణ్యక్షేత్రంలో అసాంఘిక చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు హెచ్చరించారు. కొంతమంది మతిస్థిమితం లేని పనులు చేస్తూ.. సోషల్ మీడియాలో అసత్య వీడియోలు పెడుతున్నారని అందుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకులు కె డేనియల్, కొండపల్లి మురళీ, కమ్మిలి నాగార్జున (నాని),కొమ్మర అనిల్, పృథ్వి, జి రామారావు, సిహెచ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## జలమయం అయిన రోడ్లను పరిశీలిస్తున్న..జుత్తుగ నాగరాజు



ఉండి, తెలంగాణ ముచ్చట్లు : తుఫాన్ కారణంగా ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో ఉత్తర పాలెం నుంచి రామచంద్రపురం వెళ్లే రోడ్లు జలమయం కావడంతో, శనివారం పరిశీలించిన ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ జుత్తుగ నాగరాజు, మహాదేవపట్నం గ్రామ సర్పంచ్ వనుమ సుబ్బలక్ష్మి శ్రీనివాస్, పంచాయితీరాజ్ జెఈ సోమేశ్వరరావు. ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ జుత్తుగ నాగరాజు వీలైనంత త్వరగా రోడ్లకు మరమ్మత్తులు చేయాలన్నారు.



## ముంపు బాధితులకు సహాయం అందించాలి


భీమవరం,తెలంగాణ ముచ్చట్లు : ముంపు బాధితులకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలను అందించాలని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. దుర్గాపురం, లంకపేటలో 38వ వార్డులో కొన్ని నివాసాలు నిరాశ్రయులయ్యారని విఆర్ఓ తెలిపారని, వెంటనే 40 మందికి భోజనాలు అందించాలని, పగలు రాత్రి కూడా అందిస్తామని అన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ శ్యామల మెంటే వారి తోటలోని షెల్టర్ బాధితుల గురించి తెలిపారని, 64 మంది కుటుంబిలకు 3 రోజులపాటు భోజనాలు అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, కట్టా నరసింహస్వామి సహరిస్తున్నారని, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.





## సబ్ జైల్ తనిఖీచేస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రీనివాస్


నర్సాపురం, తెలంగాణ ముచ్చట్లు : అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె . శ్రీనివాస్ శనివారం స్థానిక ఉప కారాగారాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వంటశాలను , ఆహార పదార్థాలను, జైలు ప్రాంగణాన్ని పరిశీలించారు. ముద్దాయిల కేసు వివరాలు, వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకొలేని వారు జైల్ విజిటింగ్ లాయర్ ని సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని, సెప్టెంబర్ 14 న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను రాజీ పడతగిన క్రిమినల్ కేసులలో ఉన్న జైల్ ముద్దాయిలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. . బెయిల్ పై బయటకు వెళ్లిన వారు కేసు పూర్తి అయ్యేవరకు ప్రతీ వాయిదాకు హాజరు కావాలన్నారు. జైల్ విజిటింగ్ లాయర్ కె. శిరీష, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె. చిట్టి పద్మజ, ఉప కారాగారం పర్యవేక్షణ అధికారి టి. అప్పారావు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.





యండగండి డ్రైయిన్ ప్రతిష్టతకు చర్యలు తీసుకున్న జలవనుల శాఖ అధికారులు..

# సినిమా న్యూస్




## అల్ట్రా స్టైలిష్ లుక్ లో అనసూయ.. నెవ్వర్ బిఫోర్



టాలీవుడ్ నటి అనసూయకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. సోషల్ మీడియాలో ఆమె పిక్స్ కు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. అనసూయ ఒంపుసొంపుల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. నాలుగు పదుల వయసులో నాజూగ్గా కనిపిస్తూ తన అందం తో కుర్రకారును కట్టి పడేస్తోంది. కొత్త కొత్త పిక్స్ తో నెటిజన్లను అలరిస్తోంది. ఎప్పటి కప్పుడు అందాల ఆర బోతతో వైవమరిపి స్తుంటోంది. గ్లామర్ షో అంటే ఇలా ఉండాలని అంటోంది! జబర్దస్త్ కామెడీ షోతో సూపర్ పాపులారిటీ దక్కించుకున్న అనసూయ.. తెలుగు ప్రేక్షకుల మనుసుల్లో చెరగని ముద్ర వేసుకుంది. బుల్లితెర యాంకర్ గా కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలో సడెన్ గా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. స్మాల్ స్క్రీన్ కు గుడ్ బై చెప్పేసింది. వరుస ఆఫర్లు అందుకుంటూ దూసుకుపోతోంది. చేతి నిండా సినిమాలతో బిజీ బిజీగా గడుపుతోంది. తన టాలెంట్ ను చూపిస్తూ ఆకట్టుకుంటోంది. త్వరలో పలు చిత్రాలతో రానుంది. అయితే సినిమాలు చేస్తూనే.. పలు షోస్ లో కూడా పాల్గొంటోంది అమ్మడు. అందుకు ప్రత్యేకంగా సిద్ధమై ఫిదా చేస్తోంది. అదే సమయంలో ఓ ఛానెల్ లో వచ్చే షో కోసం వీక్లీ వన్స్ వెరైటీగా రెడీ అవుతూ ఆకట్టుకుంటోంది. ఈ వీకెండ్ కోసం అల్ట్రా స్టైలిష్ గా రెడీ అయింది. అందుకు సంబంధించిన పిక్స్ ను లేటెస్ట్ గా షేర్ చేసింది. గ్రీన్ కలర్ సింగిల్ పీస్ డ్రెస్ వేసుకున్న అమ్మడు.. స్పెషల్ కర్లీ నైజీరియన్ హెయిర్ స్టైల్ చేయించుకుంది. సోఫాపై కూర్చుని హొయలు ఒలికిస్తోంది. బ్యాక్ పోజ్ తో మైండ్ బ్లాక్ చేస్తోంది. థైస్ షోతో సెగలు రేపుతోంది. వయ్యారంగా నిల్చుని వేడి పుట్టిస్తోంది.

# సమంత 'రక్త బ్రహ్మాండ'



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ సమంత గత ఏడాది ఖుషి మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా యావరేజ్ టాక్ సొంతం చేసుకుంది. ఖుషి తర్వాత సమంత కొంత గ్యాప్ తీసుకొని, ఫిజికల్ గా, మెంటల్ గా రికవరీ అవ్వడానికి షూటింగ్ నుంచి విశ్రాంతి తీసుకుంది. ఓ ఆరు నెలల పాటు షూటింగ్ లకి గ్యాప్ ఇచ్చిన సమంత మరల రాజ్ అండ్ డీకే దర్శకద్వయంతో కమిట్ అయిన సిటాడెల్ ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ కంప్లీట్ చేసింది. ఈ వెబ్ సిరీస్ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ప్రస్తుతం ఉందంట. ఇదిలా ఉంటే ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసిన సమంత తెలుగులో పాన్ ఇండియా మూవీగా కొత్త చిత్రాన్ని ఎనౌన్స్ చేసింది. అయితే ఆ సినిమా ఎప్పుడు మొదలవుతుందనేది క్లారిటీ ఇవ్వలేదు. ఇంతలో తనకి డిజిటల్ లో బ్రేక్ ఇచ్చిన రాజ్ అండ్ డీకేలతోనే మూడో వెబ్ సిరీస్ చేయడానికి సమంత రెడీ అయ్యింది. ఇప్పటికే ఈ వెబ్ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ వర్క్ కంప్లీట్ చేసుకొని షూటింగ్ కి రెడీ అవుతోందంట. రక్త బ్రహ్మాండ టైటిల్ తో తెరకెక్కబోయే ఈ వెబ్ సిరీస్ లో ఆదిత్య రాయ్ కపూర్ లీడ్ రోల్ చేస్తున్నారు. ఆయనతో పాటు సమంత ఇందులో స్క్రీన్ షేర్ చేసుకోబోతోందంట. అయితే సమంత పాత్ర ఎలా ఉండబోతోందనేది క్లారిటీ లేదు. ఈ వెబ్ సిరీస్ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ తో లార్జర్ దెన్ లైఫ్ లాంటి కంటెంట్ తో తెరకెక్కబోతోందంట. భారీ బడ్జెట్ తో పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తో ఈ వెబ్ సిరీస్ కథాంశం సిద్ధం చేసారంట. సమంత ఆగష్టు లో ఈ వెబ్ సిరీస్ షూటింగ్ లో జాయిన్ అవ్వనుందని తెలుస్తోంది. అప్పుడు అఫీషియల్ గా ఆమె క్యారెక్టర్ కి సంబందించిన ఏమైనా రివీల్ చేస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే సమంత బాలీవుడ్ పైన ప్రస్తుతం ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబై కి మకాం మార్చేసింది. అక్కడ కథలు కూడా వింటున్నట్లు తెలుస్తోంది. తెలుగులో కూడా కొంతమంది దర్శకులు సమంతకి కథలు చెబుతున్నారంట. ది ఫ్యామిలీ మెన్ 2 సినిమాతో డిజిటల్ స్పేస్ లో సమంత ఇప్పటికే స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. సిటాడెల్ వెబ్ సిరీస్ పైన కూడా ఎక్స్ పెక్టేషన్స్ ఎక్కువగానే ఉన్నాయి. ఇది ఎప్పుడు రిలీజ్ చేస్తారనేది తెలియాల్సి ఉంది. రక్త బ్రహ్మాండ ఏ మేరకు ప్రేక్షకులకి కనెక్ట్ అవుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# నేషనల్ క్రష్ అనేది నా దృష్టిలో!




యానిమల్ విజయం తర్వాత త్రిప్తి డిమ్రీ ఏ రేంజ్ లో ఫేమస్ అయిందో తెలిసిందే. ఆరేడు సినిమాలు చేసినా రాని గుర్తింపు ఒక్క పాన్ ఇండియా సినిమాతో సొంతం చేసుకుంది. బాబి గా అమ్మడు ఇండియానే ఊపేసింది. త్రిప్తీ ఇప్పుడే సినిమా చేసినా అది పాన్ ఇండియాలో ఫేమస్ అయిపోతుంది. అందుకు కారణం అమ్మడికంటూ ప్రత్యేకమైన బేస్ ఏర్పడటంతోనే అన్నది తెలిసిన వాస్తవం. అభిమానిలిప్పుడు ఆమెని చెప్పలేనంతగా అభిమానిస్తున్నారు. ఓ సందర్భంలో అభిమానుల ప్రేమపై అంతే ఆసక్తికరంగానూ మాట్లాడింది. ఇలాంటి అభిమానుల్ని సంపాదించుకోవడం గొప్ప అదృష్టంగా తెలిపింది. దీంతో అదే అభిమానిలిప్పుడు త్రిప్తీని నేషనల్ క్రష్ బ్యూటీ గాఫేమస్ చేస్తున్నారు. నేషనల్ క్రష్ అనే ట్యాగ్ ని జోడించి పిలవడం మొదలుపెట్టారు. తాజాగా ఈ అంశంపై త్రిప్తీ డిమ్రీ స్పందించింది. %-%హిందీ పరిశ్రమలో కెరీర్ మొదలై ఏడేళ్లు అవుతుంది. గొప్ప నటీనటులు, దర్శక, నిర్మాతలతో కలిసి పనిచేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే యాక్టింగ్ ని నేను సీరియస్ గా తీసుకోలేదు. మొదటి సినిమా పూర్తయిన తర్వాత దాని గురించి పెద్దగా ఆలోచించలేదు. ఒక సినిమా చేసా..అదృష్టం ఉంటే రెండవ సినిమా వస్తుంది అనుకున్నా. అదే సమయంలో %-%లైలా మజ్ను%-% కోసం ఆడిషన్ ఇచ్చా. అప్పటి నుంచి నటపనపై దృష్టి పెట్టా. ఇప్పుడు ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారు. నేషనల్ క్రష్ అనేది నా దృష్టిలో ట్యాగ్ మాత్రమే కాదు. అభిమానుల ప్రేమ. వాళ్లు నన్ను అలా పిలుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఆ ట్యాగ్ నాపై మరింత బాధ్యత పెంచింది%-% అని తెలిపింది. ఇక అమ్మడు నటించిన తాజా చిత్రం %-%బ్యాడ్ న్యూజ్ ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. సినిమా పాజిటివ్ టాక్ రావడంతో అమ్మడి ఖాతాలో మరోటి నమోదైనట్టే కనిపిస్తుంది.

# కవ్వించే చూపులతో ఇస్మార్ట్ బ్యూటీ



నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా ఈ అమ్మడు మొదటి సినిమాతోనే మంచి పేరు సొంతం చేసుకుంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో ఈ అమ్మడు చక్కగా నటిస్తుందనే మంచి మార్కులను సొంతం చేసుకుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో మాస్ లేడీ పాత్ర లో నటించడం ద్వారా మరింతగా ఈ అమ్మడికి గుర్తింపు లభించింది. అయితే కరోనా కారణంగా ఇస్మార్ట్ శంకర్ మూవీ సక్సెస్ ఈమె కెరీర్ కి తోడ్పాటును అందించలేదు. ప్రస్తుతం మీడియం రేంజ్ సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకు సాగుతుంది. హీరోయిన్ గా ఎక్కువ సినిమాలు చేయలేక పోయినా కూడా సోషల్ మీడియా ద్వారా మాత్రం రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా ఈ అమ్మడు ప్రస్తుతం డార్లింగ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. తాజాగా ఇన్ స్టాలో ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. క్లీ వేజ్ షో తో పాటు థైస్ అందాలను చూపిస్తూ విభిన్నమైన ఔట్ ఫిట్ తో నభా నటేష్ కవ్వించే చూపులతో ఫోటోలకు ఇచ్చిన ఫోజ్ కిల్లింగ్ అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేసినా కూడా పాపం నభా నటేష్ కి దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదు అంటూ ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ అందాల విందు ఫోటోలను నెటిజన్స్ తెగ షేర్ చేస్తూ లైక్ చేసి వైరల్ చేశారు.

**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in "Mail I'd: telanganamuchatlu.in@gmail.com